నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ శనివారం 29 జూన్ 2024 | ADILABAD NIRMAL

గుడిహత్నూర్‌లో కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# పేదల గుండెల్లో నిలిచిన కేసీఆర్

● హామీల అమలులో కాంగ్రెస్ విఫలం ● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

గుడిహత్నూర్, జూన్ 28: పేదలగుండెల్లో చిరునవ్వులు నింపిన కేసీఆర్‌ను ప్రజలు మరచిపోలేరని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి కుటుంబాల తల్లిదండ్రులకు ఆడబిడ్డల పెళ్లి భారం కావద్దని తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలే కొనసాగిస్తున్నారే తప్పా. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కారు అమలుచేయడం లేదని విమర్శించారు. అనంతరం 86 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు మంజూరైన సైన్స్ ల్యాబ్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. తోషం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కెంద్రె నాను, జడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్, వైస్ ఎంపీపీ భరత్, ఎంపీడీవో అబ్దుల్ హై, తహసీల్దార్ కవితా రెడ్డి, ఎంఈవో ఆర్ నారాయణ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, జీ తిరుమల్‌గౌడ్, జాదవ్ రమేశ్, సంజీవ్ ముండె, షగీర్‌ఖాన్, నారాయణ, తెలంగే మాధవ్‌జాదవ్ భీంరావ్, రాందాస్ పాటిల్, ఆశన్న యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఇంటి ముట్టడికి వచ్చిన వారిని స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

# ఎంపీ నగేశ్ ఇంటి ముట్టడి

ఎదులాపురం, జూన్28 : నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్‌లోని బీజేపీ ఎంపీ జీ. నగేశ్ ఇంటిని విద్యార్థి సంఘాల నాయకులు ముట్టడించారు. విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని నిరసన చేపట్టారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి తోట కపిల్ మాట్లాడుతూ ఎన్‌టీఏ సంస్థను రద్దు చేసి, పేపర్ లీక్ పాల్పడ్డ వారిపై క్రిమినల్ కేసులను నమోదు చేయాలని కేంద్ర సర్కారును డిమాండ్ చేశారు. ధర్నాచేస్తున్న వారిని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు బీ రాహుల్, యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేశ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి గండ్రత్ శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు కౌడాల అఖిల్, రాహుల్, సాయి ఉన్నారు.

కాలనీల్లో పర్యటిస్తున్న నిర్మల్ కలెక్టర్, అధికారులు

# డ్రై డేను పకడ్బందీగా నిర్వహించాలి

● పరిసరాల శుభ్రత పాటించాలి ● నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, జూన్ 28 : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జిల్లాలో డ్రై డే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. శుక్రవారం నిర్మల్‌లోని శాంతినగర్ కాలనీ, ఆస్రా కాలనీల్లో పర్యటించి డ్రై డే కార్యక్రమ అమలు తీరును పరిశీలించారు. వర్షపు నీరు నిలిచిన ప్రదేశాల్లో ఆమె ఆయిల్ బాల్స్‌ను వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..వర్షాకాలం దృష్ట్యా దోమలు ఎక్కువై డెంగీ, టైఫాయిడ్, మలేరియా, వంటి వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, ఇంటి పరిసరాలను శుభ్రత పాటించాలని, ఇండ్ల చుట్టూ మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, మెప్మా పీడీ సుభాష్, మున్సిపల్ డీఈ సంతోష్, వైద్యులు రాజేందర్, రవీందర్ రెడ్డి, తదితరులున్నారు.

విద్యార్థినికి రూ.50వేలు అందజేస్తున్న ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

# నీట్ ర్యాంకర్‌కు రూ.50వేల సాయం

ఎదులాపురం, జూన్ 28 : ఆదిలాబాద్ పట్టణం బంగారిగూడలో బాలికల మైనార్టీ గురుకుల పాఠశాలలో చదివిన విద్యార్థిని హమీమాఫెరోజ్ ఇటీవల జరిగిన నీట్ పరీక్షలో 545వ ర్యాంకు సాధించింది. ఆమెను శుక్రవారం గురుకులంలో సన్మానించి, రూ.50 వేలను ఆర్థిక సాయంగా మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలనే సంకల్పంతో మాజీ సీఎం కేసీఆర్ ఏర్పాటు చేసిన గురుకులాలు సత్ఫలితాలనిస్తున్నాయని కొనియాడారు. ఆదిలాబాద్ పట్టణ పరిధిలో మాజీ మంత్రి జోగు రామన్న ప్రత్యేక చొరవతో నాలుగు మైనార్టీ గురుకులాలను ఏర్పాటు చేశారని తెలిపారు. నీట్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని ఉన్నత చదువుకు అండగా నిలిచేందుకు రూ.50 వేలు ఆర్థికసాయాన్ని అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు యూనిస్ అక్బనీ, సాజీద్ ఉద్దీన్, సలీంపాషా, జోహార్, నాయకులు షేక్. ఇస్మాయిల్, ఆసిఫ్, అన్సర్, ఇస్రాల్ తదితరులున్నారు.

# సీసీఐని తెరిపించాలని కేంద్రమంత్రికి వినతి

ఎదులాపురం, జూన్ 28 : మూతపడ్డ ఆదిలాబాద్ సిమెంట్ ఫ్యాక్టరీ(సీసీఐ)ని పునఃప్రారంభించాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామికి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కలిసి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. సీసీఐని ప్రారంభిస్తే ప్రత్యేకంగా, పరోక్షంగా 5వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. పీపీపీ పద్ధతిలో రాష్ట్ర ప్రభుత్వం ఈ సిమెంట్ ఫ్యాక్టరీని చేపట్టేందుకు సిద్ధంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు కేంద్రమంత్రికి తెలిపారు. ఇందుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు.

కేంద్రమంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

పట్టణ ప్రకృతి వనాలను పట్టించుకోకపోవడంతో ఎండి పోయిన మొక్కలు

# హరితహారంపై నిర్లక్ష్యం!

## కాంగ్రెస్ సర్కారు పట్టింపులేనితనంతో ఎక్కడికక్కడ ఎండిపోయిన మొక్కలు

● నిర్వహణ లేక కళావిహీనంగా మారిన పల్లె, బృహత్ ప్రకృతి వనాలు, అర్బన్ పార్కులు ● వానలు పడుతున్నా ప్రారంభంకాని వనమహోత్సవం

మంచిర్యాల (నమస్తే తెలంగాణ ప్రతినిధి) /నిర్మల్ అర్బన్, జూన్ 28 : 'తెలంగాణ పచ్చబడాలే.. చెట్లు లేక బోసిపోయిన పల్లెలు, పట్టణాల్లో పచ్చదనం వెల్లివిరియాలే.. పరాయి పాలనలో నిర్జీవంగా మారిన అడవులకు పునరుజ్జీవం పోయాలే.. పర్యావరణ పరిరక్షణలో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలపాలే..' అనే సదుద్దేశంతో కేసీఆర్ సర్కారు చేపట్టిన హరితహారం కార్యక్రమాన్ని కాంగ్రెస్ సర్కారు పట్టించుకోవడం లేదు. నాడు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎక్కడ చూసినా పచ్చదనంతో కళకళలాడిన హరితహరం మొక్కలు.. నేడు కాంగ్రెస్ సర్కారు వైఫల్యంతో ఎండిపోయాయి. కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు, బృహత్ ప్రకృతి వనాలు కూడా ఎండిపోయి కళావిహీనంగా మారాయి. అవెన్యూ ప్లాంటేషన్లో భాగంగా రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు సైతం చాలా చోట్ల చనిపోయాయి. ఒకప్పుడు పచ్చదనానికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చిన పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్, మున్సిపాలిటీ, ఫారెస్టు శాఖల అధికారులు పట్టించుకోలేదు. కొత్త మొక్కలు నాటకపోగా.. ఉన్నవాటిని కూడా కాపాడుకునే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం.

### ప్రారంభంకాని వనమహోత్సవం

కేసీఆర్ హయాంలో తొలకరి జల్లులు (జూన్‌లో) పడగానే పట్టణాలు, పల్లెల్లో మొక్కలు నాటేవారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వానలు పడుతున్నా వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించ లేదు. జూలై నుంచి మొక్కలు నాటాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో హరితహారం కింద గతంలో నాటిన మొక్కల ఆలనాపాలనా చూస్తారా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు చాలా చోట్ల ఎండిపోగా, వాటి స్థానంలో కొత్తవి నాటుతారా లేదా అనేది తెలియాల్సి ఉంది. ఆసిఫాబాద్ జిల్లాలో 54 లక్షలు, మంచిర్యాల జిల్లాలో 31.20 లక్షల మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. మంచిర్యాల జిల్లాలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 20 లక్షల మొక్కలు నాటనున్నారు. మిగిలినవి ఫారెస్టు, ఇతర డిపార్ట్‌మెంట్స్ ఆధ్వర్యంలో నాటనున్నారు. ఈ మేరకు జీపీల్లోని నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

మంచిర్యాల పట్టణం గ్రీన్ సిటీలో ఎండిపోయిన హరితహారం మొక్కలు

నిర్మల్ నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

### పదో విడుత ప్రణాళికలేవి?

నిర్మల్ జిల్లాలోని 396 గ్రామపంచాయతీల్లోని నర్సరీల్లో డీఆర్డీఏ శాఖ ఆధ్వర్యంలో 51.48 లక్షల మొక్కల పెంపకం చేపట్టగా, నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. దాదాపు 70-80 రకాల మొక్కలను సిద్ధం చేశారు. పదో విడుత హరితహారంలో నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 30.87 లక్షల మొక్కలను నాటేందుకు లక్ష్యం నిర్దేశించారు. కానీ ఇప్పటివరకు ప్రణాళికలు రూపొందించకపోవడం గమనార్హం. గత ప్రభుత్వం హయాంలో జిల్లాలో తొలకరి జల్లులు కురవగానే పట్టణాలు, పల్లెల్లో మొక్కలు నాటేందుకు గుంతలను సిద్ధం చేసేవారు.

# రూ. 5లక్షల విలువైన గుట్కా పట్టివేత

నిర్మల్ అర్బన్, జూన్ 28 : నిర్మల్ పట్టణంలో రూ.5 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లు పట్టుకున్నట్లు జిల్లా ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. గుట్కా విక్రయాలు చేపట్టే పాన్‌షాపులు, దుకాణాలు, గోదాముల్లో శుక్రవారం రాత్రి పట్టణ నిర్మల్ పోలీసులు ఏకకాలంలో దాడులు చేశారు. నిర్మల్ పట్టణంలోని సుమారు రూ.5 లక్షల విలువ చేసే గుట్కా ప్యాకెట్లనుస్వాధీనం చేసుకున్నారు. వీటని విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. నిషేధిత మాదకద్రవ్యాలు, గంజాయి వాడినా, విక్రయించినా వెంటనే 8712659599, 8712659595 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.

పట్టుబడ్డ గుట్కాప్యాకెట్లను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

# నిర్మల్ జిల్లాలో 18.5 మి.మీ వర్షపాతం నమోదు

నిర్మల్ అర్బన్, జూన్ 28 : నిర్మల్ జిల్లాలో గత 24 గంటల్లో సగటున 18.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. జిల్లాలో గరిష్టంగా సోన్ మండలంలో 37.6 మి.మీ., అత్యల్పంగా బాసరలో 6.4 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. కుభీర్‌లో 19.6, తానూర్ 13.2, ముథోల్ 8.4, భైంసా 11.4, కుంటాల 9.4, నర్సాపూర్ (జీ) 23.6, లోకేశ్వరం 20.0, దిలావర్‌పూర్ 12.2, సారంగాపూర్ 11.4, నిర్మల్ 18.8, నిర్మల్ రూరల్ 22.0, సోన్ 37.6, లక్ష్మణ చాంద 33.4, మామడ 24.0, ఖానాపూర్ 20.6, కడెం 21.4, దస్తూరాబాద్ 22.8 వర్షపాతం నమోదైంది.

# మెరుగైన విద్యా బోధన అందించాలి

● విద్యార్థులకు మంచి వాతావరణం కల్పించాలి ● ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జూన్ 28: విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, మంచి వాతావరణంలో పిల్లలకు మెరుగైన విద్యా బోధన అందించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని బంగారిగూడలోని మండల ప్రాథమిక పాఠశాల ఉర్దూ మీడియం, రూరల్ మండలంలోని రామాయి మండల ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను పరిశీలించి, విద్యార్థులతో పాఠాలు చదివించి, బోర్డుపై రాయించారు. ప్రధానోపాధ్యాయుడు యూసుఫ్‌ఖాన్‌ను ఉర్దూతో పాటు ఇంగ్లిష్ కూడా నేర్పించాలన్నారు. బోధనసరిగా లేదని, చదవడం, రాయడంలో శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం రామాయిలోని పాఠశాల సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా వినియోగించాలని, కిచెన్‌షెడ్ ఏర్పాటు చేయాలన్నారు. తరగతి గదులు, టాయిలెట్స్ పరిశీలించి పలు సూచనలు చేశారు. అంతకుముందు బంగారి గూడలో నిర్వహించిన డ్రైడేలో పాల్గొన్నారు. కాలనీల్లో పర్యటించి రోడ్లు, ఇండ్ల చుట్టు పక్కల మురుగునీరు, చెత్త చెదారం నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. కాలనీవాసుల సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తామని తెలిపారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ ఖమ్మర్ అహ్మద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్, ఎంఈవో, తహసీల్దార్, పాఠశాల హెచ్ఎం, సంబంధిత అధికారులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థినికి వడ్డిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

# ఎన్‌హెచ్-44కు మరమ్మతులు

*ఆదిలాబాద్ జిల్లాలోని జాతీయ రహదారి-44 అధ్వానంగా మారడంతో వాహనదారుల ఇబ్బందులపై 'నమస్తే తెలంగాణ'లో శుక్రవారం 'ఎన్‌హెచ్-44 గుంతలమయం' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన ఎన్‌హెచ్ఏఐ అధికారులు శుక్రవారం దేవాపూర్ ఎక్స్‌రోడ్‌లో మరమ్మతులు ప్రారంభించారు. రోడ్డు పనులు ప్రారంభంకావడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. - ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్, జూన్ 28*

● 'నమస్తే' కథనానికి స్పందన
దేవాపూర్ ఎక్స్‌రోడ్ వద్ద కొనసాగుతున్న మరమ్మతులు

పిల్లల కోసం ఏమైనా తేవాలి : చెట్టు పైన కూర్చొని వేటకు చూస్తున్న హెరాన్ పక్షి


ఒక పెద్ద చేప దొరకాలి : చెరువులో చేప కోసం వెతుకుతూ..

హైయ్ మమ్మీ వచ్చింది : పిల్లలకు ఆహారం తీసుకువచ్చి..

పిల్లలూ నోరు తెరవండి : ఆహారం తినిపిస్తూ..

# ఆహారం తెచ్చి.. పిల్లలకు అందించి

## సీతాగొంది చెరువులో కోకోయ్ హెరాన్ పక్షుల సందడి

తల్లి ప్రేమ వేల కట్టలేనిది. మనుషులు, జంతువులు, పక్షుల్లోనైనా తల్లి ప్రేమ ఒక్కటే..ఆదిలాబాద్ జిల్లాలోని గుడిహత్నూర్ మండలం సీతాగొంది చెరువు వద్ద ఓ అరుదైన దృశ్యం కనిపించింది. కోకోయ్ హెరాన్ అనే పక్షి దూర ప్రాంతాల నుంచి చిరుధాన్యాలు, పురుగులను తెచ్చి వాగు మధ్యలో చెట్టుపై ఏర్పాటు చేసుకున్న గూడులో ఉన్న పిల్లలకు ఆహారంగా అందించింది. ఈ చిత్రాలు 'నమస్తే' కెమెరాకు చిక్కాయి. *-ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, జూన్ 28*

# పాఠశాలల్లో డీఈవో తనిఖీ

జైనథ్, జూన్ 28 : జైనథ్ మండలకేంద్రంలోని వాగ్దేవి పాఠశాలతో పాటు పిప్పర్‌వాడలోని అభ్యుదయ పాఠశాలను ఆదిలాబాద్ డీఈవో టీ ప్రణీత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆదేశించారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. ఫీజుల వివరాలను పరిశీలించారు. అనంతరం కస్తూర్బాగాంధీ ప్రభుత్వ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అక్కడ అమ్మ ఆదర్శ పాఠశాల భవనాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ పాఠశాల హెచ్ఎంలు రమణ, రాధాకృష్ణ, వాగ్దేవి హెచ్ఎం లింగన్న, జిల్లా సెక్టోరియల్ అధికారి సుజాత్ ఖాన్, కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌వో దైవశాల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేస్తున్న డీఈవో ప్రణీత